# నీ బలహీనతలను నీ బలముగా మార్చుదేవుడు

**"2 కొరి 12:10 నేనెప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను"**

## ఉపోద్ఘాతం:

జీవితంలో చాలా విషయాలలో నీవు బలహీనుడ్ని అని అనుకుంటున్నావా? అయితే నీ బలహీనతలనే నీ బలంగా దేవుడు మార్చబోతూ ఉన్నాడు. కారణం ఆయన బలహీనులను బలపర్చడానికి వచ్చిన బలమైన దేవుడు. మన దేవుడు స్వల్పమైన వాటితో గొప్ప కార్యాలు చేసే దేవుడు. అందుకే పౌలు తనెప్పుడు బలహీనుడో అప్పుడే బలవంతుడనని మరియు తన బలహీనతలే తన సంతోషం అని అంటున్నాడు. ఏవిధంగా ఇది సాధ్యమో చూద్దాం!

నీ బలహీనత నీ బలంగా మారాలంటే కొన్ని మార్గాలు ఉన్నాయి.

## 1. నీవు క్రీస్తు నిమిత్తం జీవించాలి

పౌలు యొక్క ఈ మాటలు చూడండి...(కనుక క్రీస్తు నిమిత్తము నాకు కలిగిన బలహీనతలు.. 2 కొరి12:10) పౌలు యొక్క జీవితం, పరిచర్య అంతా క్రీస్తు నిమిత్తమే.తనకోసం గాక క్రీస్తుకోసమే ఆయన బలప్రభావాలు తనలో నిలిచి ఉండాలని కోరుతున్నాడు.మనం కూడా క్రీస్తు నిమిత్తం జీవిస్తే, దేవుడు మన బలహీనతలను మన బలంగా మారుస్తాడు. కనుక ప్రభువు నిమిత్తం జీవించువారికి, శ్రమలే బలం. మోషేకు తనకున్న బలహీనతలు తనకు తెలుసు. అయితే ఐగుప్తు నిమిత్తం కాకుండా దేవుని నిమిత్తం మోషే తన జీవితం అంకితం చేసుకున్నాడు. మోషే యొక్క గొర్రెలు కాచే బలహీనమైన కర్రతో దేవుడు గొప్ప బలమైన చేశాడు. సముద్రాన్ని కూడా పాయలు చేశాడు. (నిర్గమ 14:21) శరీరంలో ముల్లుతో పౌలు,నోటి మాంద్యంతో మోషే బలహీనులుగా ఉన్ననూ వారు తమ జీవితాలను క్రీస్తు నిమిత్తం సమర్పించినారు గనుక దేవుడు వారిని గొప్ప బలశాలురుగా మార్చాడు. హల్లేలూయా!

## 2. మన మీద కాక దేవుని మీద ఆధారపడాలి

పౌలు బలహీనంగా ఉన్నప్పుడే బలవంతుడు ఎందుచేత? ఎందుకంటే తన బలహీనతను గుర్తించి ఇక తనపై, తన బలంపై, తన తెలివి తేటలపై, సమర్థతపై ఆధారపడడం మానుకున్నాడు. కేవలం దేవునిపైనే ఆధారపడ్డాడు. సాధారణంగా మనుషుల ఆలోచనలకు ఇది సరిగ్గా వ్యతిరేకం. (1 కొరింతు 2:2,4 నేను, యేసుక్రీస్తును అనగా, సిలువ వేయబడిన యేసుక్రీస్తును తప్ప, మరిదేనిని మీమధ్య నెరుగకుందునని నిశ్చయించుకొంటిని. మీ విశ్వాసము మనుష్యుల జ్ఞానమును ఆధారము చేసికొనక, దేవుని శక్తిని ఆధారము చేసికొని యుండవలెనని...)

దేవుని మీద ఆధార పడుటను బట్టి దేవుడు దావీదును బలశూరునిగా చేసాడు. (1సమూయేలు 17:49). దేవుని ఆత్మ కూడా మన బలహీనతల విషయంలో మనకు తోడ్పడుతూ ఉన్నాడు. (రోమా 8:26 అటువలె ఆత్మయు మన బలహీనతను చూచి సహాయము* చేయుచున్నాడు.) మన బలహీనతలను బలంగా మార్చివేయడానికి దేవుని ఆత్మ మనలో పని చేస్తున్నాడని చెప్పవచ్చు (2 కొరింతు 12:9,10). ఆత్మ ద్వార బలహీనమైన గాడిద దవడ ఎముక వెయ్యి మంది ఫిలిష్తీయులను చంపగలిగిన బలమైన ఆయుధంగా మారింది. (న్యాయాధి 15:14,15) కాబట్టి ప్రియులారా! అసాధారణ రీతిలో మార్గాలను తెరుచువాడు మరియు మార్గాలను మూయువాడు, అసాధారణ కార్యాలు చేయువాడు ఆయనే!

## 3. బలహీనతల్లో సంతోషంగా ఉండాలి

నాకు కలిగిన బలహీనతలలోను నిందలలోను ఇబ్బందులలోను హింసలలోను ఉపద్రవముల లోను నేను సంతోషించు చున్నాను. 2 కొరి12:10;అవమానాలు, కష్టాలు, హింసలు, కడగండ్లు వచ్చినా వీటన్నిటినీ భరించగలిగితే దేవుడు నిన్ను బలపరచి ఆనందింప జేస్తాడు.అదే కారణాన్ని బట్టి పౌలు ఆనందంగా బాధలను కూడా ఎదుర్కొన్నాడు.

క్రీస్తు కోసం హింసకు గురి కావడం అనేది ఆయన ప్రజల మేలుకే అని తెలియడం మూలంగా హింసల్లో ఆనందించగలిగే స్థితి కలుగుతుంది. (రోమా 8:17 క్రీస్తుతో కూడ మహిమ పొందుటకు ఆయనతో శ్రమపడిన యెడల, క్రీస్తుతోడి వారసులము.)తబితా(దొర్కా) వద్దనున్న చిన్న సూదితో సంతోషంగా పరిశుద్ధులకు గొప్ప పరిచర్య చేయగలిగినది. (అకా 9:39) ప్రభువు ఆమె చేసిన సూది పరిచర్యను బట్టి ఆమెను తిరిగి బ్రతికించాడు. శ్రమలు వచ్చినప్పుడు దిగులు పడకూడదు. దావీదు మాదిరిగా "శ్రమ పొంది యుండుట నాకు మేలాయెను"*అని దృఢంగా చెప్పగలగాలి. ఉన్నదానితో సంతోషంగా సంతృప్తిగా ఉండాలి. అప్పుడు దేవుడు నీ బలహీతనను నీ బలంగా మార్చగలడు. నీవు గొప్ప కార్యాలు చేయగలవు ఫిలిప్పీయులకు 4:11 నాకు కొదువ కలిగినందున నేనీలాగు చెప్పుటలేదు; నేనేస్థితిలో ఉన్నను ఆస్థితిలో సంతృప్తి కలిగియుండ నేర్చుకొనియున్నాను.

## 4. నీ నమ్మకమైన పరిచర్య నీకు మేలు చేయును

తబితా(దొర్కా) వద్దనున్న చిన్న సూదితో సంతోషంగా పరిశుద్ధులకు గొప్ప పరిచర్య చేయగలిగినది. (అకా 9: 39.పేతురు లేచి వారిలోకూడ వెళ్లి అక్కడ చేరినప్పుడు, వారు మేడగదిలోనికి అతనిని తీసికొని వచ్చిరి; విధవరాండ్రందరు వచ్చి యేడ్చుచు, దొర్కా తమతోకూడ ఉన్నప్పుడు కుట్టిన అంగీలును వస్త్రములును చూపుచు అతని యెదుట నిలిచిరి.) ప్రభువు ఆమె చేసిన సూది పరిచర్యను బట్టి ఆమెను తిరిగి బ్రతికించాడు.

Source: Pas. Abhishek

## 5. ప్రార్ధన నీ బలహీనతలను బలంగా మార్చును

శత్రువుల ఎదుట బలహీనుడుగా ఉన్న యెహోషాపాతు దేవునికి ప్రార్ధన చేయుటను బట్టి బలమైన కార్యములు జరిగినవి. యెహోషాపాతు శత్రువులపై జయం కొరకు ప్రార్ధన చేశాడు. మోయాబీయులును అమ్మో నీయులును మెయోనీయులలో కొందరును యెహోషాపాతుతో యుద్ధం చేయడానికి వచ్చారు. యెహోషాపాతు ప్రార్ధనా ఫలితంగా దేవుడు ఎంతో గోప్ప విజయాన్ని అనుగ్రహించాడు. 2దిన 20:3 అందుకు యెహోషాపాతు భయపడి యెహోవాయొద్ద విచారించుటకు మనస్సు నిలుపు కొని, యూదాయంతట ఉపవాసదినము ఆచరింపవలెనని చాటింపగా.,.

## ముగింపు

ప్రియ దేవుని బిడ్డా! బలహీనమైన పరిస్థితులలో నీవున్నావా? భయపడవద్దు. యేసును రక్షకునిగా స్వీకరించి ఆయన కృపను పొందు. దేవుడు నిన్ను ముట్టి బలపరుస్తాడు.మన దేవుడు స్వల్పమైన వాటితో గొప్ప కార్యాలు చేసే దేవుడు. బలహీనుడ్ని అని నీవు ఎన్నడు భావించవద్దు. దేవుడు అధికమైన వాటిగా అతిశయించే వారిని త్రోసివేసి, అల్పమైన వాటిని వాడుకొని తన మహిమను చాటుతాడు. ఒకవేళ ఎవరైనా గొప్పవారిగా ఎంచుకున్నట్లైతే అంతా ఖాళీ చేసి, వట్టి వారిగా వారు ఎంచుకున్న తర్వాతే వారిని వాడుకున్నాడు. బైబిల్ అంతా ఇలాంటి ఉదాహరణలతో నిండి ఉంది. ఆయన నీలో, నాలో కోరుకునేది విశ్వాసంతో దేవుణ్ని నమ్మి, సాత్వికంతో ఆయనపై సంపూర్ణంగా ఆధారపడటాన్నే! అటువంటి కృపను దేవుడు మనకు సమృద్ధిగా దయచేయునుగాక! ఆమెన్!

Source: Pas. Abhishek